# ఈ కథలో నిజముంది

పన్నగశయనరావు సాయంత్రం ఆఫీసునుంచి గదికి వచ్చేసరికి అతనికి గదిలో కిటికీలో నించి లోపలకు విసిరి వేయబడిన శుభలేఖ కనిపించింది. కుర్చీలో కూర్చుని కవర్‌లో నించి శుభలేఖను బయటకు తీసి చూశాడు.

కార్డుమీద వధువుపేరు 'పేరిందేవి' అని వుంది. వరుడు శివనాగ మల్లేశ్వరరావు.

అతను నవ్వుకున్నాడు. తన క్లాస్‌మేట్ పేరిందేవి ఇప్పటికి పెళ్లిచేసుకుంటున్నది. తప్పకుండా వెళ్లాలని అనుకున్నాడు... గుంటూరులో పెళ్లి...ఇంకో నాలుగు రోజుల్లో.

ఆ పెళ్లికి పన్నగశయనరావు వెళ్లాలని అనుకోవటానికి కారణం పేరిందేవి కోసం కాదు. అలాగనుకుంటే అతనికి పేరిందేవి మీద ప్రత్యేకించిన ఇంట్రస్టు ఏమీలేదు. కానీ కృపావతిమీద అంతులేని ఇంట్రస్టు వుంది. పేరిందేవి పెళ్లికి కృపావతి తప్పకుండా వస్తుంది...కృపావతి-పేరిందేవి మంచి స్నేహితులు...కృపావతి కూడా వాళ్లతోనే చదువుకున్నది డిగ్రీ వరకు. కాలేజీలో చదివే రోజుల్లో పన్నగశయన రావు - కృపావతి నవ్వుకోసం, ఆమె కంటి చూపుకోసం అదే పనిగా ఎదురుచూసే వాడు. ఆమె కూడా అతని పట్ల ఎంతో కొంత ఇంట్రస్టు చూపించేది... కానీ పూర్తిగా వొళ్లోకి వచ్చి వాలిపోలేదు. చివరకు కలుసుకోకుండానే విడిపోయారు.

దాదాపుగా మూడేళ్ల విరామం తర్వాత కృపావతిని కలుసుకునే అవకాశం ఇప్పుడు వచ్చింది. ఈ అవకాశాన్ని జారవిడుచుకోకూడదని అనుకున్నాడు పన్నగశయనరావు.

అలా అనుకుని అతను పెళ్లిరోజు సాయంత్రానికే గుంటూరు వెళ్లాడు. పేరిందేవి పెళ్లి జరిగే కళ్యాణమండపాన్ని తెలుసుకోవటం ఏమంత కష్టం కాలేదు.

పేరిందేవి అతడిని సాదరంగా ఆహ్వానించింది. అతను తన పెళ్లికి వచ్చినందుకు ఆమె చాలా సంతోషించి కృతజ్ఞతలు తెలియజేసుకున్నది.

పన్నగశయనరావు వెళ్లిన ఓ గంట సేపటితర్వాత కృపావతి భుజానికి ఓ లెదర్ బ్యాగ్‌ను తగిలించుకుని బస్టాండ్ అక్కడికి దగ్గరే కాబట్టి బస్సు దిగి నడిచి వచ్చింది. విసురుగా వీస్తున్న గాలికి జుట్టు రేగి మొహాన, చెవులమీదా పడుతోంది. పాదాలకు రంగు వెలిసిపోయిన ఎత్తు మడమల చెప్పులు. కృపావతిలో ఎటువంటి మార్పు లేదని అనుకున్నాడు పన్న గశయనరావు. అతడిని చూడటంతోనే పలకరింపుగా ఓ బలహీనపు నవ్వు నవ్వి–

"మీరు వస్తారని అనుకున్నాను..." అన్నది మొహం మీది స్వేదాన్ని అరచేత్తో తుడుచుకుంటూ–

"ఇలా అనుకోటానికి గొప్ప తెలివి తేటలు అవసరం లేదనుకుంటాను. క్లాసు మేటు పెళ్లికి ఎవరయినా వస్తారు. దీనికి జ్యోతిష్యంతో పనిలేదు" అన్నాడు పన్నగశయనరావు తన సహజ ధోరణిలో.

కృపావతి మొహం ముడుచుకుని "నా ఉద్దేశ్యం అదికాదు" అంటూ ఏదో చెప్పబోయింది. అప్పుడు పేరిందేవి కలగజేసుకుని "ముందు మొహాన్ని కడుక్కునిరా...నీ ఫేసు చూడలేకుండా వున్నాం" అన్నది నవ్వుతూ.

భుజానికి వున్న బేగ్‌ను తీసి గోడ వారగా వుంచి బాత్‌రూమ్‌లోకి వెళ్లింది కృపావతి.

ఓ పది నిమిషాలకు వచ్చి "రాత్రిదాకా టైము ఎలా గడుస్తుంది?" అనడిగింది పేరిందేవిని.

"పన్నగశయనం ఉన్నాడుగా...తిప్పుతాడులే" అన్నది పేరిందేవి నవ్వి. వాళ్లిద్దరి మధ్యన వున్న ఆకర్షణ గురించి ఆమెకు తెలుసు.

"మానస సరోవరం వెళదాం...వస్తావా?" అనడిగాడు పన్నగశయనరావు–కృపావతిని.

"నీతోనా?" అన్నది కృపావతి అదోలా.

"అవును. ఇంకెవరితో అయినా వెళతావా...?" కొంచెం హేళనగా అడిగాడు.

"ఇంకెవరితో వెళతాను?" అడిగింది కృపావతి.

"ఉన్నాడుగా... నీ దూరపు బంధువు–మంగళగిరి మురళీగాడు...వాడితో అనుకున్నాను. అప్పట్లో వాడు నీకోసం కాలేజీ దగ్గర కాపుకాసేవాడుకదా" అన్నాడు పన్నగశయనరావు.

"వాడిని నువ్వింకా మరిచిపోలేదా? నిజమే! వాడికి నామీద ఇంకా ఆశ చావ లేదనుకుంటాను" అన్నది కృపావతి.

"ఇంతకీ నాతో వస్తున్నావా? లేదా?" అడిగాడు.

"కొంచెం షోకు చేసుకోవాలి... ప్రయాణం చేసివచ్చాను కదా...నాకొంచెం టైమివ్వండి" అన్నది కృపావతి.

పన్నగశయనరావు తల వూపాడు. తర్వాత బయటకు వచ్చి సిగరెట్టు కాల్చుకుంటూ నిలుచున్నాడు.

పదిహేను నిమిషాల తర్వాత కృపావతి ఒక పువ్వుల డిజైను ఉన్న నీలిరంగు చీర కట్టుకుని నవ్వుతూ బయటకు వచ్చింది. అప్పుడు పన్నగశయనరావు ఆటో రిక్షాను మాట్లాడాడు మానస సరోవరానికి.

ఇద్దరూ ఎక్కారు. ఆటోలో అతనితో అలా ప్రయాణం చెయ్యడం కృపావతికి బావుంది.

ఇరవై నిమిషాల తర్వాత మానస సరోవరం బయట ఆటోదిగి లోపలకు నడిచారు. కొంత దూరం చెట్లమధ్య నడిచి రెండు చెట్లమధ్య వున్న సిమెంటు బెంచీమీద కూర్చున్నారు. అతను స్ప్రే చేసుకున్న టామీగర్ల్ స్ప్రే వాసన కృపావతికి ఆహ్లాదకరంగా వుంది. పన్నగశయనరావు అందంగా వున్నాడా? లేదా? అనే విషయాన్ని సరిగ్గా ఎవరూ చెప్పలేరు. అతడిలో అందంకంటే ఏదో ఒక విధమైన ఆకర్షణ వుందని ఎవరైనా వొప్పుకుంటారు.

"కృపావతీ" పిల్చాడు పన్నగశయనరావు.

"ఏమిటీ? ఈ ఏకాంతాన్ని భరించడం కష్టంగా వుందా? గొంతు అదోలా వుంది" అన్నది కృపావతి.

ఉలికిపాటును కప్పి పుచ్చుకుంటూ "నీతో ఒక విషయం చెప్పాలి" అన్నాడు.

"చెప్పండి" అన్నది.

"పేరిందేవికి కూడా పెళ్లవుతోంది..." అన్నాడు.

"అవును... తెలుసు...ఐతే ఏమిటి...?" అన్నది అదోలా.

"మన స్నేహితుల్లో అందరి పెళ్లిళ్లూ అయ్యాయి. మనిద్దరమే మిగిలిపోయాం"

"ఇప్పుడు మీ బాధ ఏమిటి? మీరు కూడా పెళ్లి చేసుకోండి... అభ్యంతర మేముంది?"

"క్లియర్‌గా చెబుతాను కృపావతీ... నాకు నిన్ను పెళ్లి చేసుకోవాలని వుంది. ఎందుకంటే మొదటినుంచీ నువ్వంటే నాకు ఇష్టం ఉంది. మన ఫ్రెండ్స్‌లో ఎవరి మీదా లేని అభిప్రాయం నీమీద వుంది. నువ్వు వొప్పుకుంటే మనిద్దరం పెళ్లి చేసుకుందాం. మనం పెళ్లి చేసుకుంటే సుఖ పడతామనే నమ్మకం నాకుంది" చిన్నగా విశ్వాసంతో అన్నాడు పన్నగశయనరావు.

అప్పుడు కృపావతి అతడివైపు కొంచెం ఆశ్చర్యంగా చూసింది. కానీ మొహంలో ఇష్టతాభావాన్ని ప్రదర్శించలేదు. ఎటు వంటి భావాన్నీ కనబరచకుండా ముభావంగా ఉండిపోయింది.

"మాట్లాడు కృపావతీ! చెప్పు... నీకిష్టమేనా?"

ఐనా ఆమె మాట్లాడలేదు...

"మౌనం అంగీకారమనుకోవచ్చా?"

"కాదు...మిమ్మల్ని చేసుకోవడం నా కిష్టమే...కానీ ఇప్పుడు చేసుకోలేను. క్షమించండి. నా పరిస్థితులు అలాంటివి..." అన్నది కృపావతి తల వంచుకుని నేల మీద పెరిగిన పిచ్చి మొక్కలను చూస్తూ.

"క్లియర్‌గా చెప్పు కృపావతీ! నాకు అర్థం కావాలి కదా!" అన్నాడు పన్నగశయనరావు.

"చెబుతాను... చెప్పకుండా వుండలేను. మిమ్మల్ని పెళ్లిచేసుకునే అర్హత నాకు లేదు... ఎందుకంటే ఈ మధ్యనే నేను పెళ్లవకుండానే నెలతప్పి ఎబార్షన్ చేయించుకున్నాను"

"నిజంగానా?"షాక్కొట్టినట్టు కొంచెం పెద్దగా అడిగాడు అతను.

"అవునండీ...! కొన్నాళ్లక్రితం ఓ ఉద్యోగం కోసం వెళ్లాను. మన ప్రాంతం కాదు... రికమండేషన్ వల్ల ఉద్యోగం వచ్చింది. చేరాను... అక్కడ ఒక్కదాన్నే వున్నాను... మా బాస్ మంచివాడు... అందంగా, హుందాగా వుంటాడు. ఆయనకు భార్య పోయిందిట. నన్ను ప్రేమగా చూసుకునేవాడు. ఆయన పేరు సూర్యచంద్రరావు. ఒకసారి ఆయనకు జ్వరం వచ్చింది... దగ్గరుండి సేవ చేశాను... అప్పుడు ఆయనకు దగ్గరయ్యాను. మా మధ్య ఆకర్షణ పెరిగింది. ఆయన జ్వరం తగ్గింది. ఆయన నాకు థాంక్స్ చెప్పి కృతజ్ఞతగా దగ్గరకు తీసుకున్నాడు. ఆయన కళ్లలో ఆకర్షణకు లొంగిపోయాను. అదే కాదు... వయసు ప్రభావం... ఆయన అందం, హోదా నన్ను ఇంకేమీ ఆలోచించ నీయలేదు. ఒకరకంగా నేను కూడా అలాంటి అవకాశం కోసం ఎదురుచూస్తు న్నానేమో తెలీదు. ఆయన కోరికను కాదనలేకపోయాను. నన్ను నేను అర్పించుకున్నాను. ఫలితం నెల తప్పాను. తీవ్రతను గుర్తించి ఆయనే ఎబార్షన్ చేయించి కొంత డబ్బు చేతిలో పెట్టి అప్పుడప్పుడు వస్తూ వుండమని చెప్పి పంపించాడు. ఇప్పటికి కూడా నా మనసులో ఆ సూర్యచంద్రరావే ఉన్నాడు... చెప్పండి...ఈ సిట్యువేషన్‌లో మిమ్మల్ని పెళ్లి చేసుకోగలనా?" అనడిగింది కృపావతి.

"ఒక సందేహం" అన్నాడు పన్నగశయనరావు.

"అడగండి"

"నీ కథ విన్న తర్వాత కూడా నేను నిన్ను పెళ్లిచేసుకోవటానికి ఇష్టపడ్డాననుకో...అప్పుడు నన్ను చేసుకుంటావా?"

"ఏమో తెలీదు. కొంచెం ఆలోచించి చెబుతాను" అన్నది కృపావతి నవ్వి.

"నువ్వు ఆ సూర్యచంద్రరావుకు లొంగిపోయే తరుణంలో నీకు మంగళగిరి మురళీగాడు గుర్తుకు రాలేదా?" అనడిగాడు నవ్వి.

కృపావతి కూడా నవ్వి "మంగళగిరి మురళీగాడు గుర్తుకు రాలేదు. మంగపేట మధుసూదనరావూ గుర్తుకు రాలేదు. ఆ ఒంటరితనం అలాంటిది... అయినా మంగళగిరి మురళీగాడు బికారి. వాడి దగ్గర ఏముంది? కేవలం వయసుతప్ప" అన్నది చాలా

తేలిగ్గా.

అప్పుడు పన్నగశయనరావు ఆమెను భయంగా చూశాడు. దీని మనసులో ఇన్ని ఆలోచనలున్నాయా అన్నట్టు, ఇది ఇంత ముదిరిపోయిందా అన్నట్టుకూడా...

"ఇక వెళదామా?" అన్నాడతను.

లేచి నిల్చుంది కృపావతి.

ఇద్దరూ బయటకు వచ్చిన తర్వాత రోడ్డుమీద ఖాళీగా వెళుతున్న ఆటో కనపడింది. అందులో ఎక్కారు.

దారిలో అడిగాడు పన్నగశయనరావు-

"ఆ సూర్యచంద్రరావుకు భార్య లేదని అన్నావుకదా...ఆయన్నే పెళ్లి చేసుకోమని అడక్కపోయావా?"

"అడిగాను"

"ఏమన్నాడు?"

"వాడికో కూతురు ఉంది... వాడు నన్ను పెళ్లి చేసుకోడుట. పెళ్లి చేసుకునే ఉద్దేశ్యం లేదుట. ఆ ఉద్దేశ్యమే వుంటే ఎప్పుడో చేసుకునే వాడుట... భార్య లేకుండా లైఫ్‌ను ఎంజాయ్ చేస్తాడుట. అంటే వాడికి నేను కీపు లాగా ఉండాలి. మోజు తీరేదాకా వుంచుకుని ఆ తర్వాత నాకు కొంత డబ్బిచ్చి లేకపోతే ఒక చిన్న ఇల్లును నా పేర రాసి నన్ను శాశ్వతంగా వదిలించుకుంటాడు. వాడికి చాలా ఇళ్లున్నాయిలే...ఉద్యోగంలో లంచాలు తీసుకుని చాలా సంపాదించాడు..." అంటూ ముగించింది.

ఆటో కళ్యాణమండపం ముందు ఆగగానే దిగి ఇద్దరూ లోపలకు వెళ్లారు. తను విశ్రాంతి తీసుకోవాలని కృపావతి ఖాళీగా వున్న ఒక గదిలోకి వెళ్లింది... అప్పుడు పన్నగశయనరావు పెళ్లికూతురు పేరిందేవి గదిలోకి వెళ్లాడు. పేరిందేవి కాఫీ తాగుతోంది. వెళ్లి ఆమె ఎదురుగా వున్న కుర్చీలో కూర్చున్నాడు.

"మనసు విప్పి మాట్లాడుకున్నారా?" అడిగింది పేరిందేవి.

మాట్లాడుకున్నాం...ఐనా ప్రయోజనం లేదు...కృపావతి నన్ను చేసుకోటానికి వొప్పుకోలేదు.." అన్నాడతను.

"ఎందుకు? నీకేం తక్కువ. ప్రభుత్వ ఉద్యోగివి" అన్నది.

అప్పుడు పన్నగశయనరావు తనకు కృపావతి చెప్పిన సూర్యచంద్రరావు గురించీ, ఎబార్షన్ కథనూ చెప్పాడు.

అంతా విని పేరిందేవి నవ్వి "అంతా ప్లాన్ ప్రకారమే జరిగింది" అన్నది.

"క్లియర్‌గా చెప్పు పేరిందేవీ" అన్నాడు పన్నగశయనరావు.

"నీకు తనని పెళ్లి చేసుకునే ఆలోచన వున్నట్టు కృపావతికి తెలుసు. నువ్వు అవకాశం

చూసుకుని అడుగుతావనీ తెలుసు. అందువల్ల నీకు తన మీదవున్న ప్రేమ, ఇష్టాల తీవ్రతకు ఒక పరీక్ష పెడతానని నాకు చెప్పింది. మీరు మానస సరోవరం వెళ్లడానికి ముందు. ఆ పరీక్షలో నువ్వు నెగ్గితేనే కృపావతితో పెళ్లి. అప్పుడు ఆ సూర్యచంద్రరావు స్టోరీని క్రియేట్ చేసింది. ఇదంతా నిజం కాదు. నిన్ను ఫూల్‌ని చేసింది. కృపావతి గురించి నీకు తెలీదా? అన్నిరోజులు కాలేజీలో ఆమెకోసం నువ్వు ప్రయత్నం చేసినా కనీసం నీకు పమిట కొంగు కూడా తగిలించలేదు. కృపావతి అంత బలహీనురాలుకాదు. ఐనా ఆ కథను నువ్వెలా నమ్మావు?..." అన్నది పేరిందేవి.

ఆమె మాటలు విన్న తర్వాత నిజంగానే కృపావతి తనని ఇడియట్‌ని చేసిందనీ తను వెధవలాగా అన్నీ నమ్మాడనీ అనుకుని అతను ఆమెను పెళ్లి చేసుకోటానికి నిర్ణయించుకున్నాడు.

కానీ–కృపావతి అంతా నిజమే చెప్పిందనీ, కాలిపోయిన తన ప్రాణస్నేహితురాలి జీవితాన్ని...తిరిగి నందనవనం చెయ్యటానికి పేరిందేవి అదంతా అబద్ధమని పన్నగశయనరావుతో అబద్ధం చెప్పిందనీ పన్నగశయనరావుకు తెలీదు. అవును...ఎలా తెలుస్తుంది?

*(మల్లెతీగ మాసపత్రిక జూన్ 2008)*